**కథ**

**"నమస్కారమండీ" మధుసూదనరావు లోపలికి వస్తూ వనజని నమస్కరించాడు.**


# చిదంబర రహస్యం

"రండి.. రండి.. వాట్ సర్‌ప్రైజ్.. మీ అమ్మగారు చాలా సంతోషిస్తారు మీరింత తొందరగా మళ్లీ కలుసుకోడానికి వచ్చినందుకు. అదేంటో మీ అమ్మగారు మాత్రం అందరిలా ఇక్కడ ఇమడలేకపోతున్నారు" వనజ కళ్లద్దాలు సరి చేసుకుంటూ మధుసూదనరావుని కూర్చోమన్నట్టు కుర్చీ చూపించింది. వనజ 'నీడ' ఆశ్రమం సూపరింటెండెంటు. యాభై ఏళ్ల పైచిలుకు ఉన్న వనజకి ఆశ్రమమే ఇల్లు, వాకిలీ, సర్వస్వం. కొందరికి ఆవిడ మేడమ్. కొందరికి అమ్మగారు. అయితే మరికొందరికి వనజమ్మ తల్లి. కుమారిగానే ఉండిపోయిన వనజ తన ఆస్తితో ఊళ్లో వాళ్ల కొందరి సహకారంతో 'నీడ' వృద్ధాశ్రమం స్థాపించి నడిపిస్తోంది.

"మా అమ్మకి నేనంటే ప్రాణం. నాన్న లేకపోయినా చిన్నప్పటి నుంచీ పాపం ఎంతో కష్టపడి పెంచింది. ఏంటో...నేనూ మా ఆవిడా ఇద్దరం ఉద్యోగస్తులం. పిల్లలు స్కూళ్లకి పోతారు. ఇంట్లో ఒక్కర్తినే వదిలి వెళ్తే చూసే దిక్కు లేదు. అందుకనే మనసు చంపుకుని ఇక్కడ వదలాల్సివచ్చింది" మధుసూదనరావు దిగులు నిండిన స్వరంతో అన్నాడు. వనజకి ఓ క్షణం మధుసూదనరావు మాటలు తికమకగా అనిపించాయి. 'ఊసరవెల్లి రంగు మార్చినట్టుందే' అన్నట్టు మధుసూదనరావు వైపు చూసింది. ఎందుకంటే రెండేళ్ల క్రితం అనసూయమ్మని 'నీడ'లో చేర్చడానికి వచ్చినప్పుడు అనసూయమ్మ వల వలా ఏడ్చింది.

"ఓ మూలపడి ఉంటానురా...కోడల్ని నేనెప్పుడైనా పల్లెత్తుమాట అన్నానా" అంటూ వాపోయింది. నిజానికి 'నీడ'కి వచ్చేటప్పటికి అనసూయమ్మ వయసు డెబ్భై ఏళ్లు అయినా మనిషి పాతిక మందికి వండిపెట్టగలిగే స్థితిలో దృఢంగా ఉండేది. మధుసూదనరావు పిల్లలు పెద్దవాళ్లు అయ్యేవరకూ చక్కగా తనని వాడుకుని ఆ తర్వాత ఇంట్లో ఒక్కర్తీ ఉంటే చూసేవాళ్లు లేరు అంటూ తెలివిగా ఆశ్రమంపాలు చేశాడు అన్నది అర్థమై అనసూయమ్మ 'నీడ'కి చేరాక చిక్కిశల్యమైపోయింది. 'నీడ'లో వదిలి వెళ్లాక 'మాసికం' పెట్టినట్టు నెలకోసారి ఆశ్రమంలో అటెండెన్స్ వేయించుకుని ముళ్లమీద ఉన్నట్టు ఓ రెండు గంటలు తల్లితో గడిపి వెళ్లిపోయేవాడు. కోడల్నీ, పిల్లలనీ కూడా తీసుకురమ్మని ఎన్నిసార్లు అనసూయమ్మ బతిమాలినా తీసుకువచ్చేవాడు కాదు, ఎప్పుడూ ఏదో వంక చెప్పేవాడు.

"మా ఆవిడకి అమ్మ సహాయం లేక ఇంటా బయటా పనితో నడుం విరిగిపోతోంది. మామ్మ ఇంట్లో లేకపోతే



ఎంతో వెలితిగా ఉంది నాన్నా... మామ్మని మళ్లీ తెచ్చుకుందాం అని పిల్లలు పోరుతున్నారు. వాళ్ల మామ్మని ఒప్పించి తీసుకెళ్లాలని వాళ్లూ..మా ఆవిడా కూడా వచ్చారు."

"నిజంగా?" వనజ అపనమ్మకంగా చూసింది. ఇదివరకు ఎన్నిసార్లు అనసూయమ్మ వాళ్లని తీసుకురమ్మని బతిమాలినా తీసుకురాలేదు. "వాళ్లకెక్కడ కుదురుతుందీ" అని విసుక్కునేవాడు. అనసూయమ్మ బాధ చూడలేక వనజ కూడా చెప్పి చూసింది. అందరూ కలిసి వస్తే అనసూయమ్మ సంతోషిస్తుందని. వనజ మాటలనీ ఏనాడూ లక్ష్య పెట్టలేదు మధుసూదనరావు. అలాంటిది ఇప్పుడు అందరూ కలిసి రావడం, అనసూయమ్మని వెనక్కి తీసుకెళ్లాలనుకోవడం...

"ఏంటి మేడమ్, ఏం ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు మీ మాటలు వింటే మీ అమ్మగారు ఎంత సంతోషిస్తారో...ఆవిడ ఇక్కడ ఉంటుంది కానీ ఎప్పుడూ మీ ధ్యాసే..ఆవిడని పిలిచి ఈ శుభవార్త చెపుదాం" వనజ బెల్ నొక్కి ఆయాని పంపి అనసూయమ్మని తీసుకురమ్మని చెప్పింది. కొడుకు, కోడలు, మనవల్ని చూసి అనసూయమ్మ ఆనందంతో ఉక్కిరిబిక్కిరైంది. ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చారు అనగానే మరీ పొంగిపోయింది.

"వెళ్తారా" వనజ అడిగింది.

"వెళ్లక..." ఇంక ఇక్కడ ఉండే ఖర్మ నాకేంటి అన్నట్టు చూసింది అనసూయమ్మ.

"ఆశ్రమంలో చేరినప్పుడు ఉన్నట్టే ఇప్పుడూ మీరు కొన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేయాలి. విశ్వంగార్ని ఆఫీసులో కలిసి వివరాలు కనుక్కుని కంప్లీట్ చేయండి. రేపు తీసుకెళ్లవచ్చు"

మధుసూదనరావు వనజకి థాంక్స్ చెప్పి తల్లినీ, పిల్లల్నీ

**చిట్టిపెద్ది ఉమ**

తోటలో కూర్చోబెట్టి ఆఫీసు రూమ్ వైపు నడిచాడు.

★ ★ ★

"హలో.."

"హలో...రాజుగారా...మీ నాన్నగారు ఎలా ఉన్నారం టారా...కాలం గడుపుతున్నారు. ఆశ్రమంలో అందరికీ రామాయణం, భాగవతం చదివి వినిపిస్తూ ఉంటారు. ఈ వాతావరణానికి అలవాటు పడిపోయారు."

"వ్వాట్...ఇంటికి తీసుకెళ్తారా?"

"మీరింతగా తీసుకెళ్తానంటే మాకభ్యంతరం ఏం ఉంటుంది. మీ వీలు చూసుకుని రండి. మీ నాన్నగారితో మాట్లాడి ఆయన 'ఊ' అంటే తీసుకెళ్లండి" వనజ ఫోన్ క్రెడిల్ మీద ఉంచి టేబుల్ మీద ఉన్న గ్లాసులో మంచి నీళ్లు తాగింది.

"మేడం...పరశురామ్‌గారు వచ్చారు"

"పరశురామ్‌గారా?" వనజ విస్మయంలో మునిగిపో యింది.

తల్లిని నాలుగేళ్ల క్రితం ఆశ్రమంలో వదిలి వెళ్లిన మహా నుభావుడు మళ్లీ దర్శనమివ్వలేదు. నెలనెలా క్రమం తప్పకుండా డ్రాఫ్ట్ పంపడం తప్ప ఏనాడూ ఫోన్ కూడా చేయలేదు. అప్పుడప్పుడు చూసి వెళ్లండి అన్న వనజ రిక్వెస్టుని కానీ, తల్లి వేడుకోలుని కానీ ఏనాడూ లక్ష్యపెట్ట లేదు.

"మేడమ్ హౌ ఆర్ యూ?" పరశురామ్ నవ్వుతూ లోపలికి వచ్చి వనజ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చు న్నాడు.

"ఆశ్రమానికి రావాలని నాలుగేళ్ల తర్వాతైనా అనిపిం చింది, సంతోషం. హౌ ఆర్ యూ? అని నా గురించి అడిగే బదులు 'హౌ ఈజ్ మై మదర్?' అని అడిగితే బావుండేది. ఎనీ వే ఆశ్రమంలో మీకు కావల్సిన వాళ్లు ఒకళ్లు ఉన్నారని నాలుగేళ్లకైనా గుర్తుకొచ్చింది. సంతోషం"

"మీరు చాలా నిష్ఠూరంగా మాట్లాడుతున్నారు మేడమ్. అమ్మ... అమృతమూర్తి దేవత. మేం అమ్మని వద్దనుకుని ఆశ్రమంలో వదలలేదు. వీలు లేక గత్యం తరం లేక ఉంచాల్సి వచ్చింది. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయి. అమ్మని ఇంటికి తీసుకెళ్దామనే వచ్చాను"

"నిజంగానా?"

"మీతో పరాచికాలాడతానా? నిజంగానే...అమ్మని పిలి పించండి. ఇహ గంటలో ట్రైన్ ఉంది వెళ్లి పోతాం."

"సరే...మీరు చాలా దూరం నించి వచ్చారు కాబట్టి ఈరోజు అన్ని ఫార్మాలిటీస్ పూర్తవుతాయేమో చూస్తాను. మీరు వెళ్లి మీ అమ్మగారితో కాస్సేపు గడపండి."

'ఏంటో...ఇవ్వాళ విచిత్రాలమీద విచి త్రాలు...వీళ్లందరికీ ఒకేరోజు వాళ్ల తల్లిదండ్రు లని తీసుకెళ్లాలని జ్ఞానోదయం ఎలా అయిందో?' వనజ ఆలోచిస్తూనే ఫైల్స్ తీసి ఆశ్రమం నించి బయటికి వెళ్లే వాళ్ల ఫార్మాలి టీస్ పూర్తి చేయమని క్లర్క్ విశ్వంగారిని పురమాయించింది.

"మేడమ్...శివనాథ్‌గారు వచ్చారు."

"లోపలికి పంపు. ఇంకా ఏడాదవ్వలేదు ఈయన వచ్చి...ఈ ఏడాది ఇంకోసారి అమ్మ అద్దెకి కావాలి కాబోలు" వనజ మాటలకి కిసుక్కున నవ్వింది ఆయా.

"చాల్లే నవ్వింది...వెళ్లి ఆయనని పంపించు."

శివనాథ్ ఓ ఫ్యాక్టరీ వర్కర్. ప్రతి ఏడాది వాళ్ల ఫ్యాక్టరీ యజమాని 'మదర్స్ డే' నాడు తల్లిదండ్రులని తీసుకుర మ్మని వాళ్లతో కలిసి విందు వినోదాలతో గడుపుతాడు. అలా వచ్చిన పెద్దలకి బట్టలు పెట్టి మదర్ గౌరవార్థం అంటూ ఒక్కో తల్లికీ రెండు వేల రూపాయల నగదు కూడా ఇస్తాడు. ఆ డబ్బు కోసం శివనాథ్ ప్రతీ ఏడాదీ ఆశ్రమం నుంచి సుమతి అన్న ఆవిడని తన తల్లిగా తీసు కెళ్తాడు. సుమతి శివనాథ్ తల్లికి స్నేహితురాలు. పిల్లలు లేని సుమతి భర్త పోయాక ఆశ్రమానికి తనంత తానుగా వచ్చి ఉంటోంది. స్నేహితురాలు కొడుకు కాబట్టి సుమ తికి అలా ఓ రోజైనా శివనాథ్ కుటుంబంలో మనిషిగా బత కడం ఇష్టమే కాబట్టి వాళ్లతో 'మదర్స్‌డే' నాడు పార్టీకి వెళ్తోంది.

"రండి శివనాథ్‌గారూ. ఈ ఏడాది రెండు 'మదర్స్ డే'లా?"

శివనాథ్ మొహమాటంగా నవ్వాడు. "మేడమ్.. ఈ రోజు మా అమ్మని నేను ఓ రోజు తీసుకెళ్లడానికి రాలేదు. ఇంకెప్పుడూ ఆవిడని నా దగ్గరే ఉంచుకుంటాను పర్మి నెంట్‌గా మాతో ఉంచుకోవడానికే నిర్ణయించుకుని తీసు కెళ్లాలని వచ్చాను"

వనజ శివనాథ్ వైపు ఆశ్చర్యంగా చూసింది. "మీ ఆర్థిక పరిస్థితి..."

"మేం తినేదే ఆవిడకీ పెడతాను. అమ్మ అంగీకారం కావాలి. అంతే." "మీరు తీసుకెళ్తామనంటే ఆవిడ కాద నరు. మీరంటే చాలా అభిమానం. మీ పిల్లలు ప్రియ, శివకుమార్‌లని ఎప్పుడూ తల్చుకుంటూ ఉంటుంది. మీ అమ్మాయి మీ అమ్మలా ఉంటుందిట. అందుకని ఆవిడకి తన స్నేహితురాలు చిన్నప్పటి రూపంలో ఉన్నట్టు అనిపిస్తుందిట. నడవండి ఆవిడ ఈ టైములో మొక్కల సంరక్షణ చేస్తుంది. ఏ పొద్దులు తప్పుతూనో మొక్కలకి పళ్లెలు కడుతూనో ఉంటుంది. నడవండి వెళ్లి కలిసి అడుగుదాం" వనజ శివనాథ్‌ని తీసుకుని గార్డెన్ వైపు నడిచింది.

★ ★ ★

వనజకి రెండు రోజులుగా ఒకటే పని. ఒక్కోసారి వనజకి ప్రపంచం మారిపోయింది అన్నంత ఆశ్చర్యంగా ఉంటోంది. ఆ రెండు రోజుల్లో ఇంకొంతమంది కొడు కులు, కూతుళ్లు మా తల్లిదండ్రుల్ని తీసుకెళ్తాం అంటూ వచ్చి తీసుకెళ్లిపోయారు. ఆశ్చర్యపోవడానికీ ఆలోచించ డానికీ కూడా తీరుబడి లేని పనితో సతమతమై మూడో రోజు కాస్త ఊపిరి పీల్చుకుంది వనజ.

"ఏంటో విశ్వంగారూ..అంతా కలలా అనిపిస్తోంది. ఇంకొంచెం మంది నిన్నా మొన్నాలా వచ్చి మావాళ్లని తీసుకెళ్లిపోతాం అంటే మీరూ నేనూ...ఖాళీ ఆశ్రమం మిగులుతాం" వనజ నవ్వింది.

"మీకూ విచిత్రంగా లేదూ ఇంతమందిలో ఒకేసారి మార్పు రావడం...తల్లిదండ్రుల విలువ తెలుసుకోవడం ఆశ్చర్యంగానూ ఆనందంగానూ ఉంది. కదూ..."

"మారిపోవడమా నా బొంద?" విశ్వంగారు కళ్లజోడు ముక్కుమీదికి తోసుకుంటూ అన్నాడు.

"అదేంటండీ అలా అంటారు. ఎంతో మంది వాళ్ల వాళ్లని ఇంటికి తీసుకెళ్లారా లేదా ఈ రెండు రోజుల్లో..." అంది వనజ.

"'తీసికెళ్లారు...రైటే...కానీ దాని వెనుకో చిదంబర రహస్యం ఉంది. "మీకు...ఈ ఆశ్రమం...ఇక్కడి వాళ్ల బాగోగులు...భోజనాలు...మందులు మాకులు తప్ప మరో ప్రపంచం లేదు. అందుకే మీకు తేడా తెలియ లేదు."

"ఏమయింది ఇంతకీ..."

"బడ్జెట్ వచ్చింది"

"వస్తే..."

"వస్తే ఏముంది...దాని మహిమే... మన ఆశ్రమం సగం ఖాళీ కావడానికి కారణం"

"నాకర్థం కావటం లేదు మీరేమంటున్నారో!"

"బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్స్‌కి వడ్డీ ఎక్కువ ఇచ్చారు. అందుకే సీనియర్ సిటిజన్స్ ఇంట్లో ఉంటే లాభమన్న మాట. అందుకే ప్రేమ ఒలకబోసుకుంటూ వాళ్ల వాళ్ల పిల్లలు వచ్చి తీసికెళ్లిపోయారు వాళ్ల పెద్దవాళ్లని."

వనజ మొహం ఒక్కసారిగా నల్లబడింది. ఇంత భాగోతం ఉందా నిన్నా, మొన్నా జరి గిన సంఘటన వెనక. ఎంత స్వార్థం?

"పోన్లెండి... ఏ కారణంవల్లనైతేనే...పిల్లలు వాళ్ల తల్లిదండ్రులని తీసికెళ్లారు...అదే పదివేలు" వనజ అసంతృప్తినీ, నిరసననీ తన లోపలే అణగతొక్కుకుంటూ అంది. డబ్బు కోసమైనా వాళ్లని ఆదరించి వాళ్ల ఆరోగ్యం గురించి పట్టించుకుంటే అంతకంటే ఇంకేం కావాలి వృద్ధులకి.

